


ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 357 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
ఆదివారం 27 జూలై 2025

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు రైతులకు అన్యాయం చేయొద్దు:మంత్రి తుమ్మల

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 27, (రిపబ్లిక్ న్యూస్): యూరియా సరఫరాపై కేంద్రంతో ఏప్రిల్ నుంచి అనేక దఫాలుగా చర్చించామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సంప్రదింపులు జరిపినా యూరియా సరఫరాలో కేంద్రం నిర్లక్ష్యం చేసిందని చెప్పారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్లో జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 9.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేశారన్నారు. జూన్లో 45 శాతం లోటు ఉందని తెలిపారు. కేంద్రం ప్రకటనలకు, సరఫరాకు చాలా తేడా ఉందని చెప్పారు. కేంద్ర మంత్రులు కిషన్రెడ్డి, బండి సంజయ్కు లేఖలు రాశామన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్రావుకు కూడా లేఖ రాసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు రైతులకు అన్యాయం చేయొద్దని సూచించారు. యూరియా సరఫరాకు రాష్ట్ర భాజపా నేతలు బాధ్యత తీసుకోవాలన్నారు.

# స్పేస్‌డే నాటికి సలహాలు పంపండి:ప్రధాని మోదీ

జూలై 27, (రిపబ్లిక్ న్యూస్): ఆగస్టు 23వ తేదీన నేషనల్ స్పేస్ సందర్భంగా ప్రజలు సలహాలు, సూచనలు పంపాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇందుకు నమో యాప్ను వాడుకోవాలన్నారు. ప్రధాని మోదీ 124వ మన్కిబాత్ కార్యక్రమం నేడు ప్రసారమైంది. ఈ సందర్భంగా ప్రధాని పలు అంశాలను తన కార్యక్రమంలో ప్రస్తావించారు. "గత కొన్ని వారాలుగా స్పేస్, సైన్స్ రంగాల్లో విజయాల గురించి మనం మాట్లాడుతున్నాం. వ్యోమగామి శుభాంశు శుక్లా భూమి పైకి తిరిగి వచ్చారు.



చంద్రయాన్-3 విజయవంతం సమయంలో కూడా దేశంలో ఎంతో ఉత్సాహం నెలకొంది. ఆగస్టు 23న నేషనల్ స్పేస్. ఈ సందర్భంగా మీరు సలహాలు, సూచనలు నమో యాప్ ద్వారా పంపండి. 1908లో ముజఫర్పూర్లో ఓ యువకుడిని ఉరితీశారు. ఆ సమయంలో అతడి ముఖంలో భయం లేదు.. ఆత్మవిశ్వాసం ఉంది. అతడి పేరు ఖుదిరామ్ బోస్. వయసు 18 ఏళ్లు. దేశాన్ని కదిలించాడు. అలాంటి చాలా త్యాగాల ఫలితంగానే మనం నేడు స్వేచ్ఛా వాయువులు పీల్చుకొంటున్నాం. ఆగస్టు నెల ఓ విప్లవ మాసం. ఆగస్టు 15 నాడు మనం స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకొంటాం. 1905 ఆగస్టు 7వ తేదీన సరికొత్త ఉద్యమం మొదలైంది. స్వదేశీ ఉద్యమం స్థానిక ఉత్పత్తుల్లో మరింత జవసత్వాలను నింపింది. ముఖ్యంగా వస్త్రపరిశ్రమలో ఇది కనిపించింది. దానికి చిహ్నంగానే ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాం. వస్త్ర తయారీ రంగం దేశానికి అదనపు బలంగా మారింది. మహారాష్ట్ర నుంచి కవిత ధావ్లా, ఒడిశా నుంచి మయూర్భాంజ్, బిహార్ నుంచి నవీన్ కుమార్ చేనేతలో స్ఫూర్తిమంతంగా ఉ ంటున్నారు.మహారాష్ట్రలో 12 కోటలను ప్రపంచ వారసత్వ సంపదగా యూనెస్కో గుర్తించింది. కొన్నేళ్ల క్రితం రాయగఢ్కు వెళ్లాను. అది నాకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. అస్సాంలోని కజిరంగా నేషనల్పార్క్లో గడ్డి భూమి పక్షులకు నిలయం. అక్కడ 40 రకాలు ఉన్నాయి. టెక్నాలజీ బృందాలు వాటి కూతలు, ఏఐ ఆధారంగా లెక్కించాయి. టెక్నాలజీ, సెన్సివిటీ కలిస్తే ప్రతిదీ తేలిక అవుతుంది" అని మోదీ పేర్కొన్నారు.

# మాపై కోపముంటే జైల్లో పెట్టండి..
## విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు:హరీశ్ రావు

నాగర్‌కర్నూల్, జూలై 27, (రిపబ్లిక్ న్యూస్): "సీఎం రేవంత్ రెడ్డి.. మా పై కోపం ఉంటే జైల్లో పెట్టండి.. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు" అని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి నేత హరీశ్రావు అన్నారు. నాగర్కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడలోని బాలికల గురుకుల పాఠశాలలో రాత్రి ఫుడ్ పాయిజన్ అయి అస్వస్థతకు గురైన విద్యార్థినులను ఆదివారం ఆయన పరామర్శించారు.

అనంతరం మీడియాతో హరీశ్రావు మాట్లాడుతూ.. కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. సాంబార్లో కూడా పురుగులు వస్తున్నాయని విద్యార్థినులు చెబుతున్నారన్నారు. "గురుకులాల్లో మెనూ ప్రకారం తిండి పెట్టట్లేదు. రేవంత్రెడ్డి నుంచి మాటలు కాదు.. చేతలు కావాలి. ఈ సారి కలుషిత ఆహారం కేసులు వస్తే చర్యలు తీసుకుంటానని సీఎం అన్నారు. సీఎం మాటలు అధికారులు వినట్లేదా? ఢిల్లీకి వెళ్లడానికి ఆయనకు సమయం ఉంటుంది. విద్యార్థుల సమస్యలపై చర్చించడానికి లేదా? ఈ అంశంపై అసెంబ్లీ సమావేశాలు పెట్టి చర్చించాలి. మానవహక్కుల కమిషన్, హైకోర్టు ఈ ఘటనల్ని సుమోటోగా తీసుకోవాలి. కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది" అని హరీశ్రావు అన్నారు.



# భారత్‌లో సింగపూర్ పెట్టుబడులకు ఏపీ గేట్వేగా ఉంటుంది:సీఎం చంద్రబాబు

జూలై 27, (రిపబ్లిక్ న్యూస్): సింగపూర్‌తో రాజధాని అమరావతి నిర్మాణ భాగస్వామ్యం విషయంలో అలా జరిగి ఉండకూడదని తన పర్యటనలో కొన్ని రికార్డులను సరిచేసేందుకు ప్రయత్నం చేస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు.. భారత హైకమిషనర్ డాక్టర్ శిల్పక్ అంబులేకు స్పష్టం చేశారు. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పాలసీలు, పెట్టుబడులకు గల అవకాశాలను సీఎం వివరించారు. సింగపూర్లోని భారత హైకమిషనర్ అంబులేతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. మంత్రులు లోకేశ్, పి. నారాయణ, టీజీ భరత్తో తో పాటు ఉన్నతాధికారులు భేటీలో పాల్గొన్నారు.



గ్రీన్ ఎనర్జీ రంగంలో 160 గిగావాట్లు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని సీఎం వెల్లడించారు. గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు ఏపీలో ఇప్పటికే పట్టాలెక్కాయని తెలిపారు. ఇండియా క్వాంటం మిషన్లో భాగంగా క్వాంటం వ్యాలీ అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు అవుతుందన్న చంద్రబాబు.. డిఫెన్స్, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్ సంస్థలకు రాయలసీమ ప్రాంతంలో అనువైన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఇండియాకు సింగపూర్ నుంచి పెట్టుబడులు రావాలని, వాటికి ఏపీ గేట్ వేగా ఉంటుందని స్పష్టంచేశారు. సింగపూర్లో 83 శాతం పబ్లిక్ హౌసింగ్ అని హైకమిషనర్ వివరించారు. ఏపీలో చేపడుతున్న ప్రాజెక్టుల గురించి మంత్రి నారాయణ వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అవసరమైన సహకారాన్ని అందించాలని కోరారు. విద్యా రంగంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, తమ ఆలోచనలను మంత్రి లోకేశ్ వివరించారు. ఏపీలో ఇప్పటికే ఏర్పాటవుతున్న ప్రముఖ విద్యా సంస్థల గురించి వివరించారు. ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇండియాతో సింగపూర్ ప్రభుత్వం మంచి సంబంధాలను కలిగి ఉందని శిల్పక్ అంబులే తెలిపారు. భారత్లో ప్రత్యేకించి ఏపీలో పెట్టుబడులకు సింగపూర్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని భారత హైకమిషనర్ వెల్లడించారు. సింగపూర్ ప్రభుత్వంలో, స్థానిక పారిశ్రామిక వర్గాల్లో సీబీఎన్ బ్రాండుకు ప్రత్యేక గుర్తింపు ఉందని హైకమిషనర్ వ్యాఖ్యానించారు.

# కడప స్టీల్‌ప్లాంట్..
## రూ.4,500 కోట్లతో తొలి దశ పనులు

అమరావతి, జూలై 27, (రిపబ్లిక్ న్యూస్): వైఎస్సార్ కడప జిల్లా సున్నపురాళ్లపల్లెలో స్టీల్ప్లాంట్ స్థాపనకు ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్లాంట్ ఏర్పాటుపై జేఎస్ డబ్ల్యూ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. దీంతో రూ.4,500 కోట్ల పెట్టుబడితో స్టీల్ప్లాంట్ తొలి దశ పనులు ప్రారంభం కానున్నాయి. రూ.11,850 కోట్లతో రెండో దశ పనులు పూర్తి చేయనున్నారు.

ఈ ప్లాంట్ కోసం సంస్థకు ఎకరా రూ. 5లక్షల చొప్పున ప్రభుత్వం సున్నపురాళ్లపల్లెలో 1,100 ఎకరాలు కేటాయించింది. 2026 జనవరి నాటికి తొలి దశ పనులు ప్రారంభించి, ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. 2029 ఏప్రిల్ నాటికి ఉత్పత్తి ప్రారంభించాలని ఆదేశించింది. 2031 జనవరి నాటికి రెండో దశ పనులు మొదలు పెట్టి.. 2034 ఏప్రిల్ నాటికి స్టీల్ప్లాంట్లో రెండో దశ ఉత్పత్తి ప్రారంభించాలని స్పష్టం చేసింది. గతంలోనే ప్లాంట్కు భూమిపూజ జరిగినా.. వివిధ కారణాలతో ఆలస్యమవుతూ వచ్చింది. ఇటీవల కూటమి ప్రభుత్వం రాకతో పరిశ్రమ నిర్మాణానికి సన్నాహాలు ముమ్మరమయ్యాయి. ఇప్పటికే సున్నపురాళ్లపల్లెలో ప్రభుత్వ అధికారులు, జేఎస్ డబ్ల్యూ సంస్థ ప్రతినిధులు సర్వే నిర్వహించారు.



# గతంలో జరిగిన తప్పులు సరిదిద్దాలనే సింగపూర్ వచ్చా:సీఎం చంద్రబాబు

జూలై 27, (రిపబ్లిక్ న్యూస్): సింగపూర్ ప్రజల ఉత్సాహం రాష్ట్ర అభివృద్ధికి దోహదం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పెట్టుబడులే లక్ష్యంగా సింగపూర్లో చంద్రబాబు పర్యటన కొనసాగుతోంది. ఈ సందర్భంగా.. తెలుగు డయాస్పోరా ఫ్రమ్ సౌత్ ఈస్ట్ ఏషియా కార్యక్రమంలో సీఎం ప్రసంగించారు. "తెదేపా హయాంలోనే మూడేళ్లలో 300 ఇంజినీరింగ్ కళాశాలలు ఏపీలో ఏర్పాటయ్యాయి. పెద్దఎత్తున ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటుపై చాలా మంది విమర్శించారు. 1991లో పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారు.

దేశ ఆర్థిక వ్యవస్థకు దశ, దిశ రూపకల్పన చేసిన వ్యక్తి పీవీ నరసింహారావు. భవిష్యత్తు అంతా ఐటీ, నాలెడ్జ్ ఎకానమీకి ఉంటుందని నమ్మా. నాలెడ్జ్ ఎకానమీలో తెలగుజాతి అగ్రగామిగా ఉండాలంటే ఐటీని ప్రమోట్ చేయాలని ఆలోచించా. సింగపూర్లో వేలాది తెలుగు ప్రజలు ఉండేందుకు ఆనాటి ఆలోచనలే కారణం. ప్రపంచంలో 120కి పైగా దేశాల్లో తెలుగు ప్రజలు ఉన్నారు. ఒక వ్యక్తి ఫౌండేషన్ ద్వారా సింగపూర్ గౌరవప్రదమైన దేశంగా ఎదిగింది. సింగపూర్లో 40వేల మంది తెలుగు ప్రజలు ఉన్నారంటే గర్వంగా ఉంది. అమరావతి మాస్టర్ ప్లాన్ను సింగపూర్ ప్రభుత్వం ఉచితంగా తయారు చేసి ఇచ్చింది. 2019 తర్వాత సింగపూర్ ప్రభుత్వాన్ని తప్పుపట్టే పరిస్థితి తెచ్చారు. ప్రభుత్వ బ్రాండ్ పోతే ఏపీ నష్టపోతుందని సింగపూర్ ప్రభుత్వానికి చెప్పా. గతంలో జరిగిన తప్పులు సరిదిద్దాలని సింగపూర్ పర్యటనకు వచ్చా" అని చంద్రబాబు వివరించారు.





## తెలుగుజాతి కోసం పనిచేయాలని అప్పుడే నిర్ణయించుకున్నా:లోకేశ్

మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... ప్రపంచంలో ఎక్కడ చూసినా తెలుగువారున్నారంటే ఆ క్రెడిట్ చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ప్రపంచంలో తెలుగు ప్రజలు శాసించేందుకు ఆయన విజనరీ కారణమని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 30లక్షల మంది తెలుగు ప్రజలు ఉన్నారని లోకేశ్ తెలిపారు. "రాష్ట్రంలో రాజకీయాలు, రాష్ట్ర పరిస్థితుల గురించి నా కంటే మీకే బాగా తెలుసు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో సైకో పాలన, విధ్వంస పాలన చూశాం. ఎన్నికల సమయంలో కొందరు దాదాపు 6 నెలలు ఏపీకి వచ్చి కష్టపడ్డారు. రాష్ట్రాన్ని దారిలో పెట్టే విషయంలో కష్టపడినందుకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నా. గతంలో చంద్రబాబు అరెస్టయినపుడు ఇదంతా మనకు అవసరమా అని బ్రాహ్మణి అడిగింది. అదే సమయంలో హైదరాబాద్ లో 45 వేల మంది ఐటీ నిపుణులు చంద్రబాబు వెంట ఉంటామని చెప్పారు. ఐటీ నిపుణులు అండగా నిలబడ్డారు.. అదే మాకు కొండంత ధైర్యం ఇచ్చింది. తెలుగు జాతి అన్ని రంగాల్లో నెంబర్ వన్ గా నిలిచేందుకు కష్టపడాలని ఆరోజే నిర్ణయించుకున్నా. దారి తప్పిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు సీఎం అహర్నిశలు కృషి చేస్తున్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సింగపూర్ను రోల్ మోడల్గా తీసుకుంటున్నాం" అని లోకేశ్ తెలిపారు. రాష్ట్ర మంత్రులు నారాయణ, టీజీ భరత్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# కేటీఆర్ పై సీఎం రమేశ్ ఆరోపణలు వాస్తవమే
## :కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్, జూలై 27, (రిపబ్లిక్ న్యూస్): భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పై భాజపా ఎంపీ సీఎం రమేశ్ చేసిన ఆరోపణలు వాస్తవమే అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. సీఎం రమేశ్ సవాలు కేటీఆర్ సమాధానం చెప్పాలన్నారు. వారిద్దరి మధ్య బహిరంగ చర్చ ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. "కేటీఆర్తో చర్చకు సీఎం రమేశ్ను నేను తీసుకొస్తా. బహిరంగ చర్చకు తేదీ, సమయం కేటీఆర్ చెప్పాలి. భారత రాష్ట్ర సమితి కుటుంబ పార్టీ, అవినీతి పార్టీ అని ఎన్నో సార్లు చెప్పాం. ఆ పార్టీని భాజపాలో చేర్చుకునే ప్రసక్తే లేదు. ప్రధాని మోదీ నిజామాబాద్ సభలో ఇదే చెప్పారు" అని బండి సంజయ్ అన్నారు.



# మళ్లీ ఒకే వేదికపై మెరిసిన ఉద్ధవ్-రాజ్ సోదరులు

ముంబయి, జూలై 27, (రిపబ్లిక్ న్యూస్): విడిపోయిన అన్నదమ్ములు ఉద్ధవ్ ఠాక్రే, రాజ్‌ఠాక్రేలు మరోసారి ఒకే వేదికపై మెరిశారు. మహారాష్ట్ర ప్రభుత్వ త్రిభాషా సూత్రానికి వ్యతిరేకంగా ఇటీవల వర్లిలో చేపట్టిన ఉమ్మడి నిరసన కార్యక్రమంలో దాదాపు 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికను పంచుకున్న ఈ సోదరులు.. తాజాగా మాతోశ్రీ వేదికగా సమావేశమయ్యారు.



మాజీ సీఎం, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే పుట్టిన రోజు వేడుకల వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది. మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన అధ్యక్షుడు రాజ్ఠాక్రే ఆదివారం ఉద్ధవ్ నివాసమైన మాతోశ్రీకి తన అనుచరులతో కలిసి వచ్చారు. పుట్టిన రోజు సందర్భంగా తన సోదరుడికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. అలాగే, వీరిద్దరూ బాలాసాహెబ్ ఠాక్రే చిత్రపటం ముందు ఫొటో దిగారు. ఈ సందర్భంగా కరచాలనం చేస్తూ ఠాక్రే సోదరులిద్దరూ చిరునవ్వులు చిందించారు. ఈ సందర్భంగా రాజ్ ఠాక్రే బాలాసాహెబ్ కుర్చీకి నమస్కరించి ఆయన ఆశీస్సులు తీసుకొని నివాళులర్పించారు. మాతోశ్రీలో జరిగిన ఈ కలయిక ఇరు కుటుంబాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను మరింతగా తగ్గించేందుకు, దాయాదుల మధ్య సంబంధాల్ని మెరుగుపరిచేందుకు ఓ సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బాలాసాహెబ్ ఠాక్రే చివరి రోజుల్లో 2012లో రాజ్ఠాక్రే అధికారికంగా మాతోశ్రీని సందర్శించారు. ఆ తర్వాత 2019 జనవరిలో తన తనయుడు అమత్ ఠాక్రే వివాహ వేడుకకు ఉద్ధవ్, ఆయన కుటుంబ సభ్యులను ఆహ్వానించి వెంటనే వెళ్లిపోయారు. ఆ తర్వాత మళ్లీ మాతోశ్రీలో ఇద్దరు సోదరులు కలవడం ఇదే తొలిసారి. రాజ్ఠాక్రే వెంట ఎంఎన్ఎస్ పార్టీ సీనియర్ నేతలు బాల నందగావ్కర్, నితిన్ సర్దేశాయ్ ఉన్నారు. 2005లో విడిపోయిన వీరు దాదాపు 20 ఏళ్ల తర్వాత మళ్లీ ఇలా కలుసుకుంటుండటం మహారాష్ట్ర రాజకీయాల్లో కీలక ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# కీరవాణిని అవమానించారంటూ

## థంబ్‌నైల్స్.. 'విశ్వంభర' స్పెషల్ సాంగ్ పై వశిష్ఠ క్లారిటీ



చిరంజీవి హీరోగా దర్శకుడు వశిష్ఠ తెరకెక్కిస్తున్న సోషియో ఫాంటసీ మూవీ 'విశ్వంభర. ఈ చిత్రానికి ఎం.ఎం. కీరవాణి సంగీత దర్శకుడు అనే సంగతి తెలిసిందే. ఓ స్పెషల్ సాంగ్కు మాత్రం భీమ్స్ స్వరాలు సమకూర్చారు. దీనిపై ఇటీవల చర్చ జరిగింది. దాని గురించి డైరెక్టర్ మాట్లాడుతూ.. కీరవాణి ఇచ్చిన ట్యూన్ నచ్చకపోవడంతో భీమ్స్ ని తీసుకున్నామన్నది అవాస్తమని స్పష్టం చేశారు."కొన్ని యూట్యూబ్ ఛానళ్లు.. 'ఆస్కార్' వచ్చిన కీరవాణిని అవమానించారు' అంటూ థంబ్నైల్స్ పెట్టి, తమకు తోచింది చెప్పాయి. 'విశ్వంభర'లోని ప్రత్యేక గీతం చేయాల్సిన సమయానికి కీరవాణి.. 'హరిహర వీరమల్లు' నేపథ్య సంగీతంతో బిజీగా ఉన్నారు. అందుకే ఆయనే 'ఈ సాంగ్ని మరో మ్యూజిక్ డైరెక్టర్తో చేయిద్దాం' అని సలహా ఇచ్చారు. అదేంటి సర్ అని నేనంటే.. 'ఇందులో తప్పేముంది? ఒక పాట ఒకరు రాస్తే.. మరో పాట వేరొకరు రాస్తారు కదా. ఇదీ అంతే అన్నారు. నా తొలి సినిమా 'బింబిసార'కి చిరంతన్ భట్తో కలిసి ఆయన వర్క్ చేశారు. ఈ విషయాన్నీ గుర్తుచేశారు. ప్రాజెక్టు ఆలస్యం కాకూడదన్నది ఆయన ఉద్దేశం. ఈ విషయాన్ని చిరంజీవికీ ఆయనే చెప్పారు. అలా భీమ్స్ ని ఎంపిక చేశాం" అని వివరించారు. "ఆ పాటలో 'రిక్షావోడు', 'ముఠామేస్త్రి' చిత్రాల థీమ్ మ్యూజిక్ వినిపిస్తుందని కొందరు అంటున్నారు. 'ఆట కావాలా పాట కావాలా' (అన్నయ్య), 'రగులుతుంది మొగలిపొద' (ఖైదీ) లాంటి సాంగ్ అని ఇంకొందరు అభిప్రాయపడ్డారు. అవేవీ కాదు. ఇది ఫ్రెష్ సాంగ్" అని తెలిపారు. ఆ సాంగ్లో చిరంజీవితో కలిసి బాలీవుడ్ బ్యూటీ మౌనీరాయ్ స్టెప్పులేశారు. 'ముందు అనుష్క, బాలీవుడ్ హీరోయిన్లను అనుకుని తర్వాత త్రిషను ఎంపిక చేశారా? అని అడగ్గా.. అవునన్నారు. సెప్టెంబరు 25న 'విశ్వంభర' విడుదలవుతుందా? అనే ప్రశ్నపై స్పందిస్తూ.. "అప్పుడు 'ఓజీ', 'అఖండ 2' వస్తుంటే మా సినిమాని ఎందుకు రిలీజ్ చేయాలనుకుంటాం. అదంతా ప్రచారమే. అయినా పండగకు చిరంజీవి సినిమా రావాలని నేను అనుకోను. ఆయన సినిమా ఎప్పుడొస్తే అప్పుడే పండగ అనుకుంటా. వీఎఫ్ఎక్స్ పనులన్నీ పూర్తయ్యాకే విడుదల తేదీని ప్రకటిస్తాం" అని తెలిపారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## 'సింధూరం'.. కృష్ణవంశీ నన్ను తిరస్కరించారు: శేఖర్ కమ్ముల



తన శైలికి భిన్నంగా 'కుబేర'ను తెరకెక్కించి, ప్రేక్షకులను మెప్పించారు దర్శకుడు శేఖర్ కమ్ముల. ఈ క్రమంలోనే ఈటీవీ 'చెప్పాలని ఉంది' కార్యక్రమంలో పాల్గొన్నారు. కెరీర్ ప్రారంభ రోజులను గుర్తుచేసుకున్నారు. కృష్ణవంశీ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్గా వర్క్ చేయాలనుకున్నారా? అని అడగ్గా.. "యూఎస్ లో ఫిల్మ్మేకింగ్ కోర్సు చేసే సమయంలో ఓ సారి ఇండియాకు వచ్చా. అప్పుడు 'నిన్నే 'పెళ్లాడతా' సినిమా చూశా. 'భలే తీశాడు సినిమా' అని అనుకుంటూ ఆయన వద్ద పని చేయాలని నిర్ణయించుకున్నా. సింధూరం' మూవీ సెట్స్లో ఆయన్ను కలిసి.. నేను అనుకున్నది చెప్పా. ఆ టైమ్కు సినిమా చిత్రీకరణ దాదాపు 30 శాతం అయిపోయింది. అప్పటికే పలువురు వర్క్ చేస్తుండడంతో.. ఆయన సున్నితంగా నన్ను తిరస్కరించారు. సినిమా షూటింగ్ మధ్యలో కొత్త వారిని తీసుకోవాల్సి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో నాకు తర్వాత అర్థమైంది. కృష్ణవంశీతో అప్పటి నుంచి మంచి అనుబంధం ఏర్పడింది. నా సినిమాలని తొలుత ఆయనకు చూపిస్తుంటా" అని తెలిపారు. "నాది సినీ నేపథ్య కుటుంబం కాదు. ఎక్కువగా సినిమాలూ చూసేవాడిని కాదు. పుస్తకాలు కూడా ఎక్కువగా చదవలేదు. నా కాలేజీ రోజుల్లో చిరంజీవి సినిమా షూటింగ్ జరుతుండగా.. పది వేల మందిలో ఆయన నన్ను పిలిచారు. వెంటనే ఆటోగ్రాఫ్ తీసుకున్నా. అది నాపై ప్రభావం చూపింది. సినిమాల్లోకి రావడానికి అదో కారణం" అని పేర్కొన్నారు. 'లీడర్' సినిమా విషయంలో తన తండ్రి గర్వంగా ఫీలయ్యారని చెప్పారు. ఈ చిత్రానికి సీక్వెల్ చేస్తానన్నారు. సినిమా రంగంపై ఏఐ ప్రభావంపై స్పందిస్తూ.. దాని వల్ల చాలా మార్పులొస్తాయన్నారు. నెగెటివ్గా అని చెప్పలేంగానీ కొత్త అనుభూతి పంచుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ప్రజా రిపబ్లిక్ దిన పత్రిక
9948814188, 9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1911 : స్వాతంత్ర్య సమరయోధురాలు, ఆంధ్రప్రదేశ్ నుండి లోక్‌సభ సభ్యురాలైన తొలి మహిళ సంగం లక్ష్మీబాయి జననం (మ.1979).
- 1955 : ఆస్ట్రేలియాకు చెందిన మాజీ క్రికెట్ క్రీడాకారుడు అలాన్ బోర్డర్ జననం.
- 1961 : తెలుగు సినిమా నటుడు,డబ్బింగ్ కళాకారుడు సాయి కుమార్ జననం.
- 1963 : భారతీయ సినీ రంగములో ప్రసిద్ధ నేపథ్య గాయని చిత్రగా సుపరిచితురాలైన కృష్ణన్ నాయర్ శాంతకుమారి చిత్ర జననం.
- 1967 : భారతదేశ నటుడు, రచయిత, దర్శకుడు, సామాజిక కార్యకర్త, రగ్బీ యూనియన్ ఆటగాడు రాహుల్ బోస్ జననం.
- 1970 : భారత స్వాతంత్ర్య సమరయోధుడు, కేరళ ముఖ్యమంత్రిగా పనిచేసిన పీ.ఏ.థాను పిళ్లై మరణం (జ.1885).
- 1987 : విఖ్యాత పక్షిశాస్త్రవేత్త, పద్మవిభూషణుడు, రాజ్యసభ సభ్యుడు సలీం అలీ మరణం (జ.1896). (చిత్రంలో)
- 2002 : భారత ఉప రాష్ట్రపతి గాను, ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ గానూ పనిచేసిన కృష్ణకాంత్ మరణం (జ.1927).
- 2003 : ప్రపంచ ప్రసిద్ధి చెందిన హాస్యజీవి, రేడియో, టీవీ, సినిమా, రంగస్థలం వంటి అన్ని రంగాల్లోనూ హాస్యం అందరికీ పంచి నిండుగా నూరేళ్ళు జీవించిన ధన్యజీవి బాబ్ హోప్ మరణం (జ.1903).
- 2015 : భారత దేశపు ప్రముఖ క్షిపణి శాస్త్రవేత్త, 11వ భారత రాష్ట్రపతి ఏ.పి.జె. అబ్దుల్ కలామ్ మరణం (జ.1931).


సంగం లక్ష్మీబాయి



అలాన్ బోర్డర్


సాయి కుమార్


చిత్ర



రాహుల్ బోస్


పీ.ఏ.థాను పిళ్లై


సలీం అలీ


కృష్ణకాంత్


బాబ్ హోప్


ఏ.పి.జె. అబ్దుల్ కలామ్

రిపబ్లిక్ స్పోర్ట్స్

# పాక్‌తో మ్యాచ్‌లు ఎందుకు..?

## బాయ్కాట్ ఆసియా కప్ అంటున్న అభిమానులు





ఆసియా కప్ షెడ్యూల్ విడుదలైన సంగతి తెలిసిందే. లీగ్ దశలో భారత్, పాకిస్థాన్ రెండుసార్లు తలపడనున్నాయి. సెప్టెంబరు 14, 21 తేదీల్లో, ఆదివారాల్లో ఈ మ్యాచ్లు జరుగుతాయి. ఆసియా కప్ హోస్ట్ హక్కులు టీమ్ ఇండియావే అయినా.. యూఏఈ వేదికగానే మ్యాచులు జరగనున్నాయి. ఇప్పుడిదే బీసీసీఐ పై అభిమానుల ఆగ్రహానికి కారణమైంది. పహల్గాం ఉగ్ర దాడి తర్వాత పాక్తో టీమ్ ఇండియా క్రికెట్ ఆడకూడదని మాజీలు, అభిమానులు కామెంట్లు చేశారు. తాజాగా వరల్డ్ ఛాంపియన్ షిప్ లెజెండ్స్ టోర్నీలోనూ పాక్ ఛాంపియన్స్తో భారత్ ఛాంపియన్స్ ఆడకపోవడంతో రద్దైంది. ఇలాంటి సమయంలో ఆసియా కప్లో భారత్ – పాక్ మ్యాచ్లు నిర్వహించాలనుకోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. అసలు టోర్నీనే బాయ్కాట్ చేయాలంటూ ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. అలాంటి కామెంట్లు కొన్ని.. "బాయ్ కాట్ ఆసియా కప్. కార్గిల్ విజయ్ దివస్ రోజునే ఆసియా కప్ షెడ్యూల్ను ప్రకటించారు. సెప్టెంబర్ 14న ఆదివారం రోజున భారత్– పాక్ మ్యాచ్ జరగనుంది. పరోక్షంగా పీసీబీకి ఫండింగ్ చేయడమే అవుతుంది. వారు దానిని మనమీదనే ఉపయోగిస్తారుష."భారత ఆర్మీ పట్ల ఏమాత్రం గౌరవం ఉన్నా ఆసియా కప్లో పాక్ మ్యాచ్లు ఆడొద్దు. కుదిరితే రద్దు చేయండి లేకపోతే టోర్నీనే బాయ్కాట్ చేయండి"."ఓ వైపు ఆపరేషన్ సిందూర్ నిర్వహిస్తూనే ఉంటామని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. మరోవైపు బీసీసీఐ మాత్రం పాక్ క్రికెట్ మ్యాచులు ఆడేందుకు సిద్ధమవుతోంది. ఇది పూర్తిగా అవమానకరం". "ఆసియా కప్ షెడ్యూల్కు బీసీసీఐ అంగీకరించింది. ఈ లెక్కన పాక్తో టీమిండియా మూడుసార్లు ఆడే అవకాశం రావొచ్చు. దీని ద్వారా ఆ జట్టుకు భారీగా ఆదాయం వస్తుంది. పాక్ ప్రభుత్వం చేతుల్లో ఉండే పీసీబీకి డబ్బులు పోతాయి. మళ్లీ మనమీదనే దాడులు చేయిస్తుందిష.

## ఇంటి చిట్కాలు

# ఇంట్లోనే గోధుమ గడ్డి పెంచుకోవచ్చు, ఒకే ఒక జాగ్రత్త తీసుకుంటే వారం రోజుల్లోనే పెరుగుతుంది

రోజూ కొనుక్కుని తీసుకురావాలంటే ఓసారి కాకపోయినా ఓ సారైనా ఎందుకులే అని వదిలేస్తారు. అలా కాకుండా ఇంట్లోనే గోధుమ గడ్డిని పెంచుకుంటే ఈ ఇబ్బంది ఉండదు. కాస్తంత ఓపిక చేసుకుంటే ఇంట్లోనే సులభంగా పెంచుకుని ఆ తాజా గడ్డితోనే రసం చేసుకుని తాగొచ్చు.

గడ్డిలో ఏముంటుందిలే అని లైట్ తీసుకునే వాళ్లెవరైనా గోధుమ గడ్డి వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుంటే ఆ అభిప్రాయాన్ని మార్చుకుంటారు. అంత ఆరోగ్యాన్ని అందిస్తుంది ఇది. విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉండే గోధుమ గడ్డితో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. రక్తం తక్కువ ఉన్న వాళ్లు రోజూ ఈ గడ్డి రసం తాగితే చాలా త్వరగా బ్లడ్ ఇంప్రూవ్ అవుతుంది. డయాబెటిస్, బీపీ ఉన్న వాళ్లు కూడా ఈ రసాన్ని రోజూ తీసుకుంటే రెండు జబ్బులూ కంట్రోల్ లో ఉంటాయి. చాలా మంది ఈ గడ్డిని బయట నుంచి కొనుక్కొని ఇంట్లో జ్యూస్ చేసుకుంటున్నారు. ఇది కాస్త పెద్ద ప్రాసెస్ అయినా మన ఆరోగ్యం కోసం ఆ మాత్రం టైమ్ కేటాయించాల్సిన అవసరముందని గుర్తుంచుకోవాలి. అయితే..బయట కొనాలంటే చాలా ఖర్చు చేయాలి. రోజూ ఇలా కొనుక్కుని తీసుకురావాలంటే ఓసారి కాకపోయినా ఓ సారైనా ఎందుకులే అని వదిలేస్తారు. అలా కాకుండా ఇంట్లోనే గోధుమ గడ్డిని పెంచుకుంటే ఈ ఇబ్బంది ఉండదు. కాస్తంత ఓపిక చేసుకుంటే ఇంట్లోనే సులభంగా పెంచుకుని ఆ తాజా గడ్డితోనే రసం చేసుకుని తాగొచ్చు.





### ఎలా పెంచుకోవాలి



ఇంట్లో గోధుమ గడ్డి పెంచుకోవడం మరీ కష్టమేమీ కాదు. కాస్తంత ఓపిక పడితే చాలు. అయితే..ఈ గడ్డిని పెంచుకోవడానికి ముందుగా గోధుమ గడ్డి విత్తనాలు అవసరం. వీటితోపాటు మట్టి మిశ్రమం, ఓ ట్రే, స్ప్రే బాటిల్, నీళ్లు కావాలి. ముందుగా గోధుమ గడ్డి విత్తనాలను నీళ్లలో నానబెట్టాలి. దాదాపు 8 నుంచి 12 గంటల పాటు అలానే నాననివ్వాలి. లేదా రాత్రంతా నానబెట్టినా సరిపోతుంది. ఇలా చేయడం వల్ల జర్మినేషన్ జరుగుతుంది. ఆ తరవాత ఓ పెద్ద ట్రే తీసుకోవాలి. అందులో రెండు ఇంచుల మేర ఆర్గానిక్ మట్టిని నింపాలి. తరవాత దాన్ని కాస్తంత చదును చేసుకోవాలి.

### తరవాత ఏం చేయాలంటే




ట్రేలో మట్టి నింపిన తరవాత గోధుమ గడ్డి విత్తనాలను చల్లాలి. అయితే..ఇవి అన్నీ ఒక్క చోటే ఉండకుండా కాస్త దూరం దూరంగా చల్లాలి. బాటిల్ తో ఈ విత్తనాలు, మట్టిపై నీళ్లు స్ప్రే చేయాలి. మట్టి తడ్డిగా మారేంత వరకూ చల్లాలి. ఆ తరవాతే అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఈ ట్రే పై ఓ ప్లాస్టిక్ కవర్ లేదా ప్లాస్టిక్ ట్రే ని కప్పాలి. మట్టిలో ఉన్న తేమ అంతా ఆవిరి కాకుండా ఉండేందుకు ఇలా చేయాల్సి ఉంటుంది. అదే సమయంలో ఇలా కప్పి ఉంచడం వల్ల లోపల వేడి వాతావరణం ఉంటుంది. ఇది విత్తనాలు మొలకెత్తేందుకు ఉపయోగపడుతుంది. ఈ ట్రేని వెలుతురు పెద్దగా తగలని చోట, వేడిగా ఉన్న ప్రాంతంలో దాదాపు 2 నుంచి మూడు రోజుల పాటు ఉంచాలి.

### విత్తనాలు మొలకెత్తాక



విత్తనాలు మొలకెత్తిన తరవాత ఆ ట్రే పై పెట్టిన ప్లాస్టిక్ కవర్ ని తీసేయాలి. అప్పటి వరకూ వెలుతురు తగలకుండా ఉన్న ట్రేని ఎండలో పెట్టాలి. అప్పటి నుంచి రోజూ కచ్చితంగా స్ప్రే బాటిల్ తో నీళ్లు పోయాలి. అయితే..నీళ్లు మరీ అతిగా చల్లకూడదు. ఇలా చేస్తే ఓ వారం రోజుల్లో కనీసం 6 నుంచి 8 ఇంచుల మేర గడ్డి పెరుగుతుంది. అప్పుడు ఆ గడ్డిని జాగ్రత్తగా కట్ చేయాలి. అయితే..ఒకేసారి గడ్డిని పట్టి లాగేయడం లాంటివి చేయకూడదు. ఇలా చేయడం వల్ల గడ్డి పెరగడం ఆగిపోతుంది. కట్ చేసినప్పుడు కనీసం ఓ అంగుళం మేర గడ్డిని మట్టిలోనే ఉండేలా చూసుకోవాలి. ఆ పైనే కత్తిరించాలి. ఆ తరవాత గడ్డిని నీళ్లతో శుభ్రం చేసి ఆ తరవాత వాడుకోవచ్చు.

### ఈ జాగ్రత్తలు తప్పనిసరి



విత్తనాలు మొలకెత్తే సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాలి. నేరుగా సూర్యరశ్మి తగిలే చోట అసలు ఉంచకూడదు. ఇలా చేయడం వల్ల విత్తనాలకు ఎండ తగిలి అవి పొడిబారిపోయే అవకాశం ఉంటుంది. ఇక మొక్కలు పెరిగే సమయంలో కచ్చితంగా వాటికి తగిన విధంగా నీళ్లు చల్లడం చాలా ముఖ్యం. తేమ ఉంటే గడ్డి తొందరగా పెరుగుతుంది. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే గోధుమ గడ్డి చాలా వేగంగా పెరుగుతుంది. అందుకే అవి మరీ ఎక్కువ ఎత్తు వరకూ పెరిగే వరకూ ఆగకుండా ఎప్పటికప్పుడు కట్ చేస్తూ ఉండాలి.

### లాభాలివే



గోధుమ గడ్డిలో ఎన్నో విటమిన్స్, మినరల్స్ ఉంటాయి. వీటితో పాటు విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ కె పుష్కలంగా ఉంటాయి. కాల్షియం, మెగ్నీషియం, ఐరన్ ఉండడం వల్ల ఎముకలు బలంగా మారడంతో పాటు అనీమియా లాంటి సమస్యలూ తొలిగిపోతాయి. యాంటీ ఆక్సిడెంట్స్ వల్ల సెల్ డ్యామేజ్ తగ్గుతుంది. బీపీ, షుగర్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా కాపాడుతుంది. ఇందులోని ఫైబర్ జీర్ణ శక్తినీ పెంచుతుంది. కడుపు ఉబ్బరం, మలబద్ధకం లాంటి సమస్యలనూ దూరం చేస్తుంది.

**గమనిక:** ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.